క్లుప్తంగా

పారదర్శకంగా అర్హుల ఎంపిక



గట్టు: పారదర్శకంగా రెండో విడత గొర్రెల పంపిణీకి అర్హులను ఎంపిక చేస్తామని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలచెర్వు, ఆలూరు గ్రామాలలో గొర్రెల పంపిణీ కోసం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరైన మరణించినా, పట్టణాలకు వలసలు వెళ్లినా వారి పేర్లు తొలగించాలని సిబ్బందికి సూచించారు. కొత్తగా ఎవరి పేర్లు నమోదు చేయొద్దని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం బూడిదపాడు గ్రామానికి చెందిన భీంపురం రంగప్ప అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు బూడిదపాడు నుంచి పాతపాలెంకు ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమాని భీంపురం రంగప్ప, డ్రైవర్ రవిల ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

14 నుంచి పాదయాత్ర



గద్వాల అర్బన్: ఈనెల 14వ తేదీ నుంచి ఇంటింటికి సీపీఐ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఆ పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టే ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు పెద్ద బాబు, రంగన్న, ఆశన్న, గోపాల్, పరమేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

మానవపాడు: మండలంలోని జామీయా మసీదులో ఎంపీడీఓ ఫారుఖ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైల్వాన్, టీచర్ శాలమ్, హబీబ్, అన్వర్, అర్షద్, షాకీర్, నజీర్, అల్తాఫ్, చోటా, రహీమ్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హెల్త్‌క్యాంపు

అయిజ: మండలంలోని ఉప్పలలో ఆదివారం హెల్త్ క్యాంపు (ఆరోగ్య జాతర)ను నిర్వహిస్తున్నట్లు స్వేరోస్ జిల్లా కోఆర్డినేటర్ నల్లబోతుల కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉచితంగా పరీక్షలు చేసి, వైద్య సేవలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్టిఫికెట్లు అందజేత



గట్టు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం ఏఎల్ఎంసీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సర్పంచ్ ధనలక్ష్మి హాజరై వెల్‌బేబీషో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యోగసనాలు చేయడం ద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు: మండలంలోని రాంపురంలో ఆర్పీఎల్-2 క్రికెట్ పోటీలను శుక్రవారం ఎస్‌ఐ జగదీశ్వర్ ప్రారంభించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించినట్లు క్రికెట్ ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, శరవయ్య, సత్యనారాయణరెడ్డి, గోకారి, ఎంకే మూర్తి, కొండల్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, గోపాలకృష్ణ, అంజి, రాజేష్‌రెడ్డి, మల్లేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- కంపోస్టు ఎరువుల తయారీపై అవగాహన కరువు
- పట్టించుకోని అధికారులు



నీలిపల్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

మల్దకల్: గ్రామాలలో ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. సేకరించిన చెత్తద్వారా తయారుచేసిన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంది. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు స్వచ్ఛతను మెరుగుపరిచే అవకాశం ఉంటుందని ప్రణాళికా ప్రకారం ముందుకు వెళ్తోంది. ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం సెగ్రిగేషన్ షెడ్లలో ముందడుగు పడడం లేదు. గద్వాల నియోజకవర్గంలోని 5 మండలాల్లో 131 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువు మాత్రం తయారీ చేయడం లేదు. దీనికి తోడు సేకరించిన చెత్తను ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డులలో వేసి దహనం చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

నిర్మాణానికి రూ.2.50 లక్షలు

ఒక్కొక్క గ్రామ పంచాయతీలో ఒక్కొక్క సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రూ.2.50 లక్షల నిధులు కేటాయించారు. డంపింగ్ యార్డుల నుంచి వేరుచేసిన తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పోగుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేసే విధానంపై పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు అడుగులు వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కార్మికులకు అవగాహన లేకపోవడంతో చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి దహనం చేస్తున్నా అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

కొన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు ఊరికి చివరన చెరువు కట్టల వెంట నిర్మించారు. ఈ షెడ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాత్రి వేళల్లో ఆకతాయిలకు, మద్యం ప్రియులకు అడ్డాలుగా మారాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

కార్మికులకు శిక్షణ ఇవ్వాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీకం పోస్టు ఎరువు తయారీపై పంచాయతీ కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుద్ధన్న, కుర్తిరావల్‌చెర్వు

అవగాహన కల్పించాలి



కంపోస్టు ఎరువుల తయారీపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించాలి. సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించినా అవగాహన లోపంతో వాటిని సక్రమంగా వినియోగించడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని వినియోగంలోకి తీసుకురావాలి.

– గోవిందు, బిజ్వారం

వినియోగంలోకి తీసుకొస్తాం

గద్వాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో నిర్మించి నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఎరువుల తయారీపై మండల స్థాయిలో ఎంపీఓలకు శిక్షణ ఇచ్చాం. త్వరలో గ్రామ పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చి ఎరువుల తయారీకి కృషి చేస్తాం.

– శ్యాంసుందర్, డీపీఓ, గద్వాల

పనులు వేగవంతం చేయాలి



బస్టాండు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: నూతనంగా నిర్మిస్తున్న బస్టాండు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం ఆయన బస్టాండు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేసి త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులు అందజేశారు. పేదల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. అందరికి అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాసులు, భగీరథ వంశీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

‘పాదయాత్ర విజయవంతం’



మాట్లాడుతున్న రంజిత్ కుమార్

గద్వాల అర్బన్: నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గత నెల 17నుంచి 21రోజుల పాటు 400 కిలోమీటర్ మేర నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర చేపట్టామని, యాత్రకు విజయవంతంగా ముగిసిందని సహకరించిన ప్రతి ఒక్కరికి సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం రాత్రి కేటీదొడ్డి మండలం, గువ్వలదిన్నె గ్రామానికి నాగరాజు ఇంటిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. వెంటనే దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, రంగస్వామి, వెంకట్రాములు, గోవిందు, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25, 36 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రెయినేజీ, రోడ్ల, విద్యుత్ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా పైపులైన్ నిర్మాణాల కోసం తవ్విన గుంతలను పూడ్చివేయకుండా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. మున్సిపల్ చైర్మన్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

అసత్య ప్రచారాలు సహించం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ఉరుకుందు

కేటీదొడ్డి: ఎమ్మెల్యేపై ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే సహించమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు సోషల్‌మీడియాలో అసత్యాలను పోస్టులు చేస్తున్నారని ఇది సరికాదని పేర్కొన్నారు. గువ్వలదిన్నెలో ఓ వ్యక్తి ఇంటిపై బీఆర్ఎస్ నాయకుడు దాడి చేసినట్లు పోస్టులు పెట్టడాన్ని ఖండించారు. దాడి చేసిన వ్యక్తి చనిపోయి ఐదు సంవత్సరాలు అవుతుందని మృతి చెందిన వ్యక్తి ఎలా దాడి చేస్తారని ఏదిపడితే అది పోస్టులు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇకనైనా అబద్ధాలు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు హనుమంతు, యుగంధర్, కొండన్న, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

అయిజవాసికి పురోహిత భాస్కర నంది అవార్డ్

అయిజ: హైదరాబాద్‌లో త్యాగరాజ గాన సభలో శుక్రవారం చిక్కడపల్లిలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది నంది పురస్కార, పురోహిత భాస్కర నంది అవార్డును అయిజకి చెందిన సురేష్ శర్మ అందుకున్నారు. రాష్ట్ర ముఖ్య సలహాదారు సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ రాష్ట్ర టూరిస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ శ్రీనివాసగుప్తా, జనగామ స్పెషల్ కలెక్టర్ అరుణరెడ్డి, వేద పండితులు వేలంకి కృష్ణ శర్మ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డ్ రావడంతో పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో శుక్రవారం ఒకరిపై కేసు నమోదు అయ్యింది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం గువ్వలదిన్నె గ్రామానికి చెందిన కృష్ణమోహన్‌రెడ్డి వివిధ సమస్యల కారణంగా గురువారం రాత్రి అతని తల్లితో గొడవ పడ్డాడు. గమనించిన బోయపెద్ద హనుమంతు సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. కృష్ణమోహన్ రెడ్డి ఎంతకీ వినలేదు. ఆవేశంలో బోయపెద్ద హనుమంతు ఇంటిపై దాడికి పాల్పడి ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందరగా పడేశాడు. ఈ విషయమై బాధితుడు హనుమంతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కృష్ణమోహన్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేసవితాపం.. ఈత సరదా



మల్దకల్‌లో వ్యవసాయ బావి వద్ద ఈత కొడుతున్న చిన్నారులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలలోని చిన్నారులు, విద్యార్థులు ఎండల నుంచి సేద తీరేందుకు బావుల వద్ద ఈతకు వెళ్లి వేసవి తాపంను తీర్చుకుంటున్నారు. పాఠశాలలకు సెలవు ఉండడంతో శుక్రవారం చిన్నారులను తమ తల్లిదండ్రులు వెంట తీసుకెళ్లి పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు. చిన్నారులు ఈత కొడుతూ ఉత్సాహంగా గడిపారు. బాలికలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

బీసీల అభ్యున్నతికి బీజేపీ ప్రాధాన్యం



పల్లె పల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీని ప్రారంభిస్తున్న నర్సింహ

ధరూరు: ఓబీసీల అభ్యున్నతికి బీజేపీ ప్రాధాన్యం కల్పిస్తుందని జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కబీర్‌దాస్ నర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పల్లె పల్లెకు ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోదీ బీసీ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలు ఉన్నారన్నారు. బీసీలకు సముచిత స్థానం బీజేపీతోనే సాధ్యమని, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవం డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, మండల అధ్యక్షుడు రాజేష్, బీసీ మోర్చా మండల అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, కిష్టన్న, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను తొలగించడం బాధాకరం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

గద్వాల అర్బన్: పదో తరగతి తెలుగు, హిందీ పరీక్ష పత్రాల లీక్‌లో ఉపాధ్యాయులను సర్వీసు నుంచి తొలగించడం బాధాకమని పీఆర్‌టీయూ, ఎస్టీటీ, ఎస్‌టీయూ, తపస్, టీటీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం అనైతికమని, విచారణ లేకుండా సీసీఏ రూల్స్ పాటించకుండా ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగించడం అన్యాయమన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ పరమేశ్వర్ రెడ్డి, తపస్ శ్రీధర్ రెడ్డి, టీఎస్టీయూ రమేష్ బాబు, ఎస్టీటీ సోము, ఎస్‌టీయూ యూసుఫ్ పాషా, టీటీయూ బుచ్చన్న, నాయకులు ఉన్నారు.

కరుణామయుడు ఏసుప్రభువు



అయిజలో ఎంబీ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: కరుణామయుడు ఏసుప్రభువు అని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఎంబీ చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏసు బోధనలు అనుసరించాలని కోరారు. అదేవిధంగా అంబాభవానీ ఆలయంలో కమిటీ సభ్యులతో మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పట్టణంలోని మసీదులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. షాదీఖాన భవనం కోసం రూ. 30 లక్షల, ఈద్గా ప్రహరీ నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, బిజ్వారం, తాటికుంట, నాగర్‌దొడ్డి, ఎల్కూరు, మల్లెందొడ్డి, విఠలాపురం, పాల్వాయి, మల్దకల్, కుర్తిరావల్‌చెర్వు గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాస్టర్ గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, పాస్టర్లు రెవరెండ్ ఎస్ పరంజ్యోతి, డానియాల్, పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు బైబిల్ గ్రంథం ప్రాముఖ్యతను వివరించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చెన్నిపాడు ఎంబీ బేతేలు చర్చి పాస్టర్ చార్లెస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుసరించిన శాంతిమార్గం అందరు నడవాలన్నారు. కార్యక్రమంలో దుబ్బన్న, చిన్నకుర్మన్న, జయ్యన్న, అరుణ్‌కుమార్, తిరుపాల్, వివేకానందం, కాశీమ్, యుగంధర్, చంద్రబాబు, కిరణ్, రాజు, శేఖర్, యేసన్న తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు నెట్టెంపాడు, దోర్నాల, మన్నాపురం, మార్లబీడు, ర్యాలంపాడు, రేవులపల్లి, సోంపురం, అల్వలపాడు, చిన్నపాడు, చింతరేవుల తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధరూరు ఎంబీ షాలేము చర్చి పాస్టర్ నరేష్ పాల్, హోసన్నా మందిరం, మరనాథ విస్వాస సమాజం, కల్వరి చర్చి పాస్టర్లు ప్రభాకర్, సుదర్శన్ అబ్రహాం, కృపరాజ్‌లు బైబిల్ ప్రవచనాలను వినిపించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడు చెన్నిపాడు ఎంబీ బేతేలు చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



మల్దకల్‌లోని అమరవాయిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు



ధరూరు ఎంబీ చర్చిలో ..

బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ నాయకులు

పెబ్బేరు: వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ నెల 9న నిర్వహిస్తున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని బీసీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ జెండాలు మోసే కార్యకర్తలుగా, జిందాబాద్‌లు కొట్టే కూలీలుగా చూస్తున్నారని వాపోయారు. అలాగే బీసీల ఆత్మగౌరవ సభకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సహదేవుడు, భగవంతు, అంజనేయులు, వెంకటస్వామి, నాగరాజు, దేవేందర్‌నాయుడు, మహేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని పీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్, నారాయణ పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆంజనేయులు మృతి చెందడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ.. పార్టీ ఎదుగుదల కోసం కృషి చేసిన ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈమేరకు వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగాధర్ గౌడ్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర

కొత్తకోట: మండలంలో భూత్పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలు, రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని, రూ. 500లకే వంట గ్యాస్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం, ఒకేసారి రూ. 2 లక్షలు రుణమాఫీ తదితర వాటిపై అవగాహన కల్పించారు.